కథ



# సీతా'వలోకనం

వేణు మాధల

పసుపు చందన సుగంధాది తైలాలతో భూపుత్రికి మంగళ స్నానాలు జరుగుతున్నాయి. సాంబ్రాణి అత్తర్లతో అంతఃపురమంతా గుబాళిస్తున్నది. సృష్టికే తలమానికమైన వజ్రరత్న ఖచితాభరణాలు ఓపక్క, శిరీష, అడవి మొల్లలు, పారిజాత, వాసంత పుష్పాలు... కలగల్పిన పూమాలలు మరోపక్క సీతకు ఆఖరి అలంకారమై వాటి జన్మలను చరితార్థం చేసుకోవాలని ఆశపడుతున్నాయి.

తన ముద్దుల పట్టికి మరో జన్మకు సరిపడా మురిపాలను ముట్టజెప్పే ఆఖరి అప్పగింత వేడుకకోసం సూర్యచంద్రులనూ, వాయువు, అగ్నిదేవులనూ ఆయా ప్రముఖ తారలకు ఆహ్వాన సన్నాహాలలో తలమున కలవుతోంది భూదేవి.

అయినా... ఎవరు వారంతా...! సూర్యుడు, చంద్రుడు, అష్టదిక్పాలకులు ఆ భూజాతకు ప్రతిరూపాలు




కావా..! ఇంత జరుగుతున్నా సీత కళ్ళలో ఎంతో వెలితిని గమనించింది భూమాత. సీత మౌనంగానే ఉన్నా ఆమె మనస్సులోని 'అమ్మా' అన్న పిలుపు ప్రకంపనలు ఆ తల్లినీ కదిలించాయి.

‘‘తల్లీ ఏమిటీ సందేశం... సృష్టిలోని సమస్త ప్రశ్నలకు, కోట్ల సందేహాలకు, అనంత సందిగ్ధతలకు సమాధానమే నీవు. అలాంటిది నీకు సందేహమా...! ద్వాపర యుగానికి నాందీ వాక్యం జరగబోతోంది. నవయుగానికి మరో విజయచరితవు కాబోతున్నావు. నాతో ఏమైనా చెప్పాలా'' అని వాత్సల్యంతో సీతను అడిగింది భూమాత.

‘‘అవునమ్మా...! కాని నీతో కాదు.''

‘‘మరి ఎవరితోనమ్మా'' అంది భూదేవి.

‘‘అహల్యతో... ఎందుకంటే అమ్మా ... సీతగా ఈ త్రేతాయుగంలో నా పాత్ర అప్రతిహతం కదమ్మా... స్త్రీలోకానికే మకుటదాయకమైన నా ఈ సీత పాత్రను ఓనాడు అహల్య అబలగా అభివర్ణించింది. ఓసారి నా అంతరంగాన్ని ఆమె ముందు ఆవిష్కరించాలని ఉందమ్మా...'' అంటూ సీత మౌనం వీడింది.

‘‘అదేమంత కోరిక తల్లీ... ఆమెకు కూడా ఓ అతిథిగా ఆహ్వానం పంపుతాను. నువ్వు నిశ్చింతగా ఉండు సీతా..'' అంటూ నుదుటిన ఆత్మీయ చుంబనం చేస్తూ సీతను ఆలింగనం చేసుకుంది భూదేవి.

***

అంతఃపురంలోని సుందర ఉద్యానవనంలో పారిజాత తరువు కింద కూర్చోని ఉంది అహల్య. అంతలోనే తోటలోని వాతావరణమంతా ఒక్కసారిగా మారిపోయింది. అక్కడక్కడా ఎండిపోయి ఉన్న నేల పచ్చిబారి క్షణాలలో పచ్చని పచ్చికగా మారిపోయింది. అసంకల్పితంగా పురులు విప్పుకున్న తమ పింఛాన్ని, లయబద్ధంగా కదులుతున్న తమ కాళ్లను చూసుకొని మయూరాలు ఆశ్చర్యపోసాగాయి. ఇంత తీవ్రమైన మార్పును చూసి ఆశ్చర్యపోతున్న అహల్యకు అల్లంత దూరాన నడిచి వస్తున్న సీత కన్పించింది. ఇక ప్రకృతి పరవశమెందుకో అహల్యకు అర్థమైంది. సీత అహల్యను దగ్గరకు తీసుకుంది.

‘‘అహల్యా... ఓనాడు రామలక్ష్మణ సమేతగా నేను వనవాసం చేస్తున్నప్పుడు ఓ సుందర తటాకం వద్ద కలిశాము గుర్తుందా! ఎవరిచేత విచారణకు సమ్మతించకు... పురుషుల అహం ఐశ్వర్యాలలో, ప్రతాపాలలో, విద్యా, కులగోత్రాలలో ఉంటుందని, ఈ లోకంలో అనేకమంది ఆడవాళ్ళు నాలాగే ఏదో ఓనాడు వాళ్ళ అహం ముందు తలవంచక తప్పదు, నిన్ను నువ్వు తెలుసుకో సీతా... అంటూ ప్రవచించావు గుర్తుకు వచ్చిందా..? మన ఇద్దరి ఆ కలయిక తరువాత నా జీవితంలో జరిగిన ఎన్నో సంఘటనలు నువ్వు తెలుసుకొని ఉంటావు. వాటిని నువ్వు ఎలా అర్థం చేసుకున్నావో, ఏ కోణంలో పరికించావో... నువ్వు చూసిన ఆ కోణంలో నీకెటువంటి సంకేతాలు అందాయో నేను గ్రహించగలను అహల్యా'' అంది సీత.

‘‘సీతా.. అయోనిజవైన నీకే విచారణ తప్పలేదు. ఇక సామాన్య స్త్రీ విషయమేమిటి? ఇంత జరిగినా నువ్వు మళ్ళీ ఓ దుర్బలుడైన పురుషునికే భార్యగా వెళ్తున్నావా? పురుషుని కనుసన్నలలో స్త్రీ వునికిని మరోమారు చాటనున్నావా..'' అంటూ అహల్య ప్రశ్నించడం పూర్తికాగానే సీత అలవోకగా నవ్వడం చూసి అహల్యకు ఒకింత అసహనం అనిపించి మౌనం వహించింది.

‘‘నేను తయారు చేసుకున్న రాముడు నన్ను విచారించడమా'' అని సీత చెప్పగానే అహల్యకు అయోమయం ఆవరించింది.

‘‘ఏమిటి నువ్వు తయారు చేసుకున్న రాముడా...?'' మళ్ళీ అహల్యకు సందేహం.

‘‘అవును అహల్యా... శివుని విల్లుని చిటుకన వేలుతో త్రోసిన నాడే నువ్వు అర్థం చేసుకొని ఉండాల్సింది. నేను పదునైన బాణంకోసం ఎదురుచూస్తున్న విల్లునని, ఎంతటి వాడి బాణమైనా విల్లు లేనప్పుడు అది పూచిక పుల్లతో సమానం. అలా లోకకళ్యాణం కోసం నా లక్ష్యసాధనకోసం నేనెంచుకున్న బాణమే రాముడు'' అంది సీత.

‘‘సీతా నీ సంకల్ప బలం ముందు రామబాణమే అల్పమైనదా? నీ హృదయంలోని సౌకుమార్యం... నీ కంటిపాపలోని కారిన్యం... నీ ఉచ్ఛ్వాస నిచ్ఛ్వాసలో నిలిచిన నిండైన ఆత్మవిశ్వాసం... మొదటిసారి నీలో చూస్తున్నాను. నిజమైన నీవేమిటి? నీ అంతరంగాన్ని నా దోసిట నింపవా..! తెలిసినదే అయిన నీ కథ మరోమారు చెప్పవా'' ఆర్ద్రతగా అడిగింది అహల్య.

‘‘అగ్నిచేత ఆవిష్కృతమై వేదవతిగా నేను జన్మించినదే రావణుడి ఇంట. నా జన్మ రహస్యాన్ని గ్రహించిన రావణుడు నన్ను రాతి పెట్టిలో పెట్టి సాగర గర్భాన వదిలివేశాడు. ఆ తర్వాత నాగేటి చాలులో ఉద్భవమై జనకుని పుత్రిక జానకినయ్యాను. బాల్యం నుంచే నా ఉనికిని బలంగా చాటుకునే ప్రయత్నం చేశాను. చిన్నారులతో ఉన్నప్పుడు లాలనగా..., నా మాతృపితృలతో గారాలుపోతున్న వేళ సుకుమారిగా, కుస్తీలాటలలో కేసరినై గాండ్రించేదానను. ఓనాడు నా జడలోని చేమంతి పూలను పూబంతి ఉండలుగా చుట్టి బంతులాడుతున్న ఆ సమయంలో నా స్నేహితురాలు విసిరిన పూబంతి శివుని విల్లు ఉంచిన ఓ మహాసనం కిందకు చేరింది. ఇక మన ఆట కంచికి చేరిందని భావించిన నా మిత్రురాళ్ళు నా తండ్రిని తోడ్కొని వస్తున్నారు. అది గమనించిన నేను నా వామహస్తంతో గాలివాటుగా ఓ త్రోపు తోశాను. అదిగో అల్లంత దూరాన చేరింది ఆ మహాసనం విల్లుతో సహా..''

‘‘అయితే సీతా, అజేయులుగా ప్రకటించుకున్న వీరులెవ్వరు ఆ విల్లును ఒక అంగుళం కూడా కదపలేకపోయారన్న సత్యం అందరికీ తెలిసిందే. అయితే అప్పుడే నీ శక్తి ఏమిటో నీ తండ్రిగారికి లీలగా చెప్పే ప్రయత్నం చేశావన్నమాట'' అంది అహల్య.

‘‘కాదు అహల్యా. లోక కళ్యాణార్థం నేను పన్నిన వ్యూహంలో భాగంగా ఒక అన్వేషణను బహిర్గతం చేసే ప్రయత్నమే అది. అనతికాలంలోనే శివుని విల్లుని ఎక్కుపెట్టిన వానికే నా కూతురితో పరిణయమంటూ నా జనకుడు ప్రకటించడం, నేను రాముణ్ణి వరించడం జరిగింది. వజ్ర సంకల్పమైన విల్లు లాంటి నాకు రాముని రూపంలో ఓ పదునైన బాణం దొరికింది. ఇక అదను చూసి రాక్షసుడిపై సంధించడమే నా ముందున్న లక్ష్యం. రాముని వనవాస రూపంలో నాకో అవకాశం దొరుకుతుంది. రాముడు – శక్తి సంపన్నుడే, దయాళువే కానీ అతి సున్నిత స్వభావం, ఉద్వేగి – అన్నింటికీ మించి నా సాహచర్యం వీడని నా కొంగుబంగారం. కాబట్టే వద్దని వారించినా నన్ను వనవాసానికి అనుమతించాడు. అయితే అహల్యా... మీరెవరూ గమనించని ఓ విషయం చెప్పనా...?'' అంది సీత.

మౌనమే సమాధానమయ్యింది సీతకు.

‘‘మరునాడు అరణ్యానికి వెళతానని తెలిసిన వెంటనే నా తండ్రి నాకు పసుపు కుంకుమ కానుకగా ఇచ్చిన నగలను అలంకరించుకున్నాను. తరువాత రోజు నార చీరలు ధరిస్తూ... నా వంటిమీద నగలన్నీ వలచి మామగారి చేతిలో పెట్టాను. అప్పుడు మా మామగారు – 'తల్లీ జానకీ... ఇవి నీ పుట్టింటి నగలు. నువ్వు లేని ఈ రాజ్యప్రస్థానంలో వీటిని మేముంచుకోవడం మాకు శోభకరం కాదు తల్లీ...'' అంటూ నా వెంటనే పంచాల నదీ తీరం వరకు వచ్చి నగలను మూటగా కట్టి నా చేతికే అప్పగించారు. నేను వాటిని

అలాగే భద్రంగా తీసుకొని వనాలకు బయలుదేరాను. ఎందుకంటే నా వ్యూహంలో వాటి పాత్ర ప్రముఖమే. అందుకే ఆ విధి రచించాను. అష్టదిగ్బంధనమైన అంతఃపురం కంటే రావణుడి మాయకు మంచి వ్యూహం ఆ సువిశాల సుందర అరణ్యమే కదా..! అందుకే నేను అడవికి పయనమైన ఆంతర్యం..''

ఇంతలో అహల్యలో మరో ప్రశ్న రూపుదిద్దుకుంది.

''మరి సీతా! రావణుడి రాకను ముందే ఊహించావా? మరి బంగారు లేడిని చూసి భ్రమించావా?''

సందేహపూరితమైన ఆమె వదనాన్ని చూసి సీతకు మరింత ముచ్చటేసింది. సీతను తాకిన ధూళి రేణువులంతా రంగు రంగుల సీతాకోక చిలుకలుగా మారి వాటి జీవితాలను సాఫల్యం చేసుకుంటున్నాయి.

''సర్వసృష్టికి ధారణభూతమైన ధరిత్రికే ముద్దుల సీతను నేను. నాకు తెలియని మాయ ఈ సువిశాల జగత్తులో ఉంటుందా? అహల్యా... నా ఆనతి లేనిదే నా తల్లీ ఆజ్ఞాపాలితమైన ఈ భూమండలంలో గడ్డిపరకను సైతం పెకిలించడం ఆ తుచ్ఛ రావణునికి సాధ్యమా చెప్పు... తలచుకుంటే అక్కడే వాడిని భస్మం చేసేదానిని కానీ, నేను తలచినది కేవలం రావణ సంహారం ఒక్కటే కాదు. పరిపూర్ణమైన రాక్షస సంహారం. అందుకే ఆ మేఘసహిత గమనంలోనే నా ఆభరణాలను ఒక్కొక్కటిగా మార్గ సూచికగా నేలజార్చాను. అలా రాముడు లంకను చేరేలా సంకల్పించాను'' అంది సీత.

ఆ పరిసరాలన్నీ కొంగొత్త చైతన్యాన్ని నింపుకుంటున్నట్లుగా తోస్తోంది అహల్యకు. భూమిలోని వేళ్ళు పులకింతలకు లోనవడంతో కొమ్మలోంచి కొత్తకొత్త చివుళ్ళు మొలకెత్తుతున్నట్లు అనిపిస్తుంది అహల్యకు.

''సీతా! ఇంత శక్తిసంపన్నురాలివి కదా! అగ్నిపరీక్షకు ఎందుకు సమ్మతించావు.''

''సర్వవేదాలను ధరించి అగ్నినుండే వేదవతిగా ఉద్భవించినదానను. నా ప్రతిరూపం అగ్ని కాదా? మరి అలాంటి నాకు అగ్నితో పునీతమా... (గర్వంతో కూడిన చిరునవ్వుతో), ప్రపంచంలో మూడు రకాల వ్యక్తులుంటారు అహల్యా. సర్వవిద్యా సంపన్నులు, సూక్ష్మగ్రాహకులు ముందే జరగబోయే వాటిని సరిగ్గా అంచనా వేయగలిగే మనోనేత్రం కలవారు. అలాంటి వారు నూటికి పదిమంది ఉంటారు. వీరు ప్రపంచాన్ని చాలా అంతర్లీనంగా గ్రహిస్తూ ఉంటారు. వీరికి ఏ ఆర్భాటాలూ రుచించవు. తమలోని దైవాన్ని దర్శిస్తారు. వీరు ఎవరినీ కీర్తించరు.

ఇక రెండో వర్గంవారు - వీరు అంతటివారు కాకపోయినా కాస్తో కూస్తో విషయ పరిజ్ఞానం కలిగిన వారు. ఏది ధర్మం, ఏది న్యాయం అంటూ విచారిస్తూ ఉంటారు. వీరికి కొన్ని ఉద్వేగాలు ఉంటాయి. వీరు పైవర్గంవారిని అమితంగా ప్రేమిస్తూ ఉంటారు. వీరు నూటికి 15 మంది ఉంటారు.

ఇక మిగిలిన మూడవ వర్గం చాలా పామర వర్గం. వీరు నూటికి 75 మంది ఉంటారు. వీరు సూక్ష్మాన్ని అస్సలు గ్రహించలేరు. ధర్మాధర్మాలను గుర్తించలేరు. వీరికి ఉద్వేగాలు తీవ్రస్థాయిలో ఉంటాయి. వీరి ఉద్వేగాలను ఒడిసి పట్టి, వీరికనుగుణంగా వారి మనోభావాలను శాంతపరిచిన వారికి వీరు దాసులౌతారు. ప్రాణాలు సైతం ఇస్తారు. ముఖ్యంగా ఇటువంటి వర్గాన్ని ప్రసన్నం చేసుకుంటేనే రాజుగా, దేవుడిగా, నాయకుడిగా మనగల్గుతారు. మహనీయులమనుకుంటున్న అందరి కీర్తి రెపరెపలు వీళ్ళ చేతుల నుండే అల్లిక చేయబడతాయి. ఎన్ని యుగాలైనా ఆ ధగధగలు కోటి ప్రభలవలె ద్విగుణీకృతమౌతూనే ఉంటాయి. అందుకే అహల్యా...! నేను నార చీరలు ధరించినా, అగ్నిప్రవేశం చేసినా... వీరిని గెలవడానికే, నా కీర్తి పతాకలను ముందు తరాలకు చేరవేయడానికే. నేను వనవాసానికి వెళుతున్ననాడు, అగ్నిప్రవేశం చేసిననాడు వాళ్ళంతా నా పాదాలపై పడి ప్రణమిల్లారు. వాళ్ళ హృదయాల్లో నన్ను ప్రతిష్టించుకున్నారు. ఇక సూర్యచంద్రులు ఉన్నంతకాలం సీత పాత్ర సదా స్మరణీయమై మానవుల జీవితాలతో నిలవబోతోంది'' అంది సీత.

ముడుచుకున్న మత్తులో మునిగి ఉన్న మొగ్గలన్నీ తమకే తెలియని తమకంతో ఒక్కసారిగా విచ్చుకుంటున్నట్లు తోస్తుంది అహల్యకు.

''సీతా...! మరి నిండు చూలాలిగా నిన్ను అడవులకు పంపినప్పుడైనా నువ్వు రాముణ్ణి ప్రతిఘటించలేదేమి. అప్పటికే రావణ సంహారం జరిగింది. నీ లక్ష్యం తీరింది కదా'' అంటూ ప్రశ్నించింది అహల్య.

''అవును. నువ్వన్నట్లుగానే రావణ సంహారంతో నా జన్మరహస్యం దాదాపు పరిసమాప్తం. రాముడనే బాణంతో రాక్షస సంహారం చేశాను. ఇక ఆ ఆయుధాన్ని ముందు తరాలకు ఆదర్శంగా చూపడమే నా కర్తవ్యం అనుకున్నాను. అందుకే నేను వనవిహారం వెళ్ళేరోజు రాముడు రాడని తెలిసినా నేను తిరిగి రమ్మనలేదు. తన మనోభావాన్ని గ్రహించినట్లుగా నన్ను భావించాడు రాముడు. సదా ఈ సీత సహచర్యం వీడలేని జానకీరాముడికి ఈ సీత ఉనికి అసలే లేదంటే తట్టుకోగలడా? ప్రాణాలతో మనగలడా! అందుకే రాముడికి నా ఎడబాటు అలవాటు చేయాలనే తలచి ఆనందంగా అడవికి పయనమయ్యాను.

అటు తరువాత నా ఆంతర్యం చిత్రణపై మంత్రిగా, తిరుగులేని మార్గదర్శకురాలిగా, ధర్మపత్నిగా, సౌందర్య శీలవతిగా, అమేయ మాతృమూర్తిగా వెరసి సాటిలేని స్త్రీమూర్తిగా దిగంతాలకు ఆవిష్కృతమవడానికి తండ్రిసమానుడైన వాల్మీకి జన్మ తరించేలా కొన్నాళ్ళు ఆయన రచనకు సహకరించాను. నా ప్రతిరూపాలైన లవకుశులను ఏ హద్దులు లేకుండా లేడి పిల్లల్లా నా కనుసన్నలలో పెంచి వారిని రాముడికి రక్షగా నిలిపి నా పాత్రను పరిపూర్ణం చేసుకొని నా తల్లిని చేరుకున్నాను. ఇప్పుడు చెప్పు అహల్యా! నేను పురుషుడి చేత విచారించబడ్డానా? అబలనా...?''

విప్పారిన నేత్రాల నడుమ అహల్యకు సీత మరింత తేజోవంతంగా కనిపిస్తోంది ఇప్పుడు.

''నా ప్రమేయం లేకుండా నాపై జరిగిన కుట్రకు నాకు తెలియకుండానే జరిగిన సంఘటనలో నా తప్పేమిటో తెలియని అయోమయంలో పడి నాలోని చేతన శక్తి కోల్పోయాను సీతా... మగవాడి ధీరత్వంలో ఆవేశం మాత్రమే ఉంటుంది. కాని, ఆడవాళ్ళ ధీరత్వంలో ఆలోచన ఉంటుంది! పురుషుడి స్తబ్దత రాజ్యాన్ని మాత్రమే అస్థిరపరుస్తుంది. కానీ, స్త్రీ ఉదాసీనతకు సృష్టే అల్లకల్లోలమౌతుంది. నా భౌతిక నేత్రాన్ని కాక నా మనోనేత్రాన్ని తెరచి గొప్ప సత్యాన్ని చూపావు.

***

త్రేతాయుగానికి భరతవాక్యం పలుకుతున్న వైతాళికులు శాంతి ప్రవచనాలు చేస్తుండగా, అహల్య ప్రేమగా సీతకు సింధూరాన్ని దిద్దుతుండగానే సీత రూపాంతరం చెంది అడుగులు వేస్తోంది... మరో ఆరంభం వైపు... ఆలంబనకోసం అల్లాడుతున్న మరో ఆయుధం వైపు.

★


శ్రీరస్తు శుభమస్తు

కాకతీయతో కళ్యాణమస్తు

కాకతీయ మ్యారేజెస్ ప్రై. లిమిటెడ్

103, 109 & 203, విజయశ్రీ అపార్ట్‌మెంట్స్, చర్మాస్ వెనుక, అమీర్‌పేట్, హైదరాబాద్ - 500 073.

ఫోన్ : 040-2374 7777, 09396 999 999



FREE online registration & Free search

AN ISO 9001:2000 ORGANISATION

www.kaakateeya.com www.telugumarriages.com www.kannadamarriages.com www.tamilmarriages.com

| | | | |
|---|---|---|---|
| అమీర్‌పేట్ | 098481 55222 | చెన్నై (అన్నానగర్) | 093839 99999 |
| కూకట్‌పల్లి | 093913 11444 | (చెన్నై) టి. నగర్ | 093400 99993 |
| ఆర్‌టిసి క్రాస్ రోడ్స్ | 099855 47475 | (చెన్నై) పోరూర్ | 093855 99077 |
| దిల్‌సుఖ్‌నగర్ | 098485 66733 | (చెన్నై) తాంబరం | 093400 99993 |
| విజయవాడ | 093922 92939 | బెంగుళూరు | 093429 39345 |
| గుంటూరు | 098485 35375 | జయానగర్ | 093429 39343 |
| తెనాలి | 098480 31931 | మైసూరు | 093429 39342 |
| విశాఖపట్నం | 098481 63833 | కోయంబత్తూరు | 093457 94668 |
| రాజమండ్రి | 098485 35377 | సేలం | 093855 99066 |
| కాకినాడ | 098483 37378 | మధురై | 093603 35233 |
| ఖమ్మం | 093470 59988 | వెల్లూర్ | 093449 94400 |
| ఒంగోలు | 098487 11223 | తిరుచి | 098428 01111 |
| నెల్లూరు | 098481 97222 | పాండిచ్చేరి | 098421 27777 |
| తిరుపతి | 098485 35378 | ఈరోడ్ | 093855 99011 |
| కర్నూల్ | 093900 33815 | అనంతపూర్ | 093460 09348 |

www.kaakateeya.com